


EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
బుధవారం
22-10-2025
పేజీలు: 02

# రాష్ట్రపతికి తప్పిన ప్రమాదం



భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మూకు ప్రమాదం తప్పింది. బుధవారం ఆమె ప్రయాణిస్తున్న హెలికాప్టర్ కేరళలో కొచ్చిలోని ప్రమదం స్టేడియంలో ల్యాండింగ్ అయింది. ఆ సమయంలో ఈ హెలికాప్టర్ ఒక వైపునకు భూమిలోకి కూరుకుపోయింది. దీంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే అప్రమత్తమైయ్యారు. వారంతా కలిసి ఒరిగిపోయిన హెలికాప్టర్‌ను సరి చేశారు. దీంతో భద్రతా సిబ్బంది సాయంతో ముర్మూ.. హెలికాప్టర్ నుంచి కిందకి దిగారు. అయితే ఈ ఘటనపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్రపతి ద్రౌపది ముర్మూ మంగళవారం కేరళ రాజధాని తిరువనంతపురం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్ట్‌లో ఆమెకు ఆ రాష్ట్ర గవర్నర్, సీఎంతోపాటు ఇతర ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె రాజ్‌భవన్‌కు చేరుకున్నారు. అయితే ఈ పర్యటనలో భాగంగా శబరిమల, శివగిరిలోని దేవాలయాలను రాష్ట్రపతి ముర్మూ సందర్శించుకోని.. ప్రత్యేక పూజలు చేయనున్నారు. అలాగే రాజ్‌భవన్‌లో మాజీ రాష్ట్రపతి కె. ఆర్. నారాయణన్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. పాలలో సెయింట్ థామస్ కళాశాల ప్లాటినం జూబ్లీ ఉత్సవాల్లో ఆమె పాల్గొంటారు. అదే విధంగా ఎర్నాకుళంలోని సెయింట్ థెరిసా కళాశాల శతాబ్ది ఉత్సవాల్లో సైతం రాష్ట్రపతి పాల్గొనున్నారు. ఇక ఈ రోజు షెడ్యూల్ ప్రకారం.. రాష్ట్రపతి ముర్మూ పర్యటన వివరాలు.. బుధవారం ఉదయం 9.25 గంటలకు హెలికాప్టర్‌లో నీలక్కల్‌కు బయలుదేరి 11.50 గంటలకు శబరిమల చేరుకుంటారు. శబరిమలలో కొలువు తీరిన అయ్యప్ప స్వామి వారిని ఆమె దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం అక్కడి అతిథి గృహానికి చేరుకుని భోజనం చేసి విశ్రాంతి తీసుకుంటారు. ఆ తర్వాత సాయంత్రం 4.20 గంటలకు శబరిమల నుంచి బయలుదేరి తిరువనంతపురంకు చేరుకుని.. రాజ్‌భవన్‌కు వెళ్తారు. మరోవైపు రాష్ట్రపతి పర్యటన సందర్భంగా శబరిమలలో భారీగా ఆంక్షలు విధించారు. అలాగే అత్యధిక సంఖ్యలో పోలీసులు, భద్రతా సిబ్బందిని మోహరించారు.



## బ్లేడుతో యువకుడు హల్చల్

నిర్మల్ పట్టణంలోని బర్కత్‌పురాకు చెందిన అమీర్ అనే యువకుడు మంగళవారం అర్ధరాత్రి నగరేశ్వర వాడ కాలనీలో హల్‌చల్ సృష్టించాడు. సహోద్యోగితో గొడవపడుతుండగా సమాచారం అందుకుని ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసు నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు. పోలీసు వీడియో తీయడాన్ని చూసి అమీర్ రెచ్చిపోయి బ్లేడుతో డ్యూటీలో ఉన్న పోలీసుపై దాడికి యత్నించాడు. అప్పటికే తనను తాను గాయపరుచుకున్న అమీర్‌ను స్థానికులు తాళ్లతో బంధించి ఆసుపత్రికి తరలించారు. చికిత్స సమయంలో కూడా అతను దురుసుగా ప్రవర్తించగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## కొత్త మెట్రో రైళ్లు ఇప్పట్లో లేనట్లే..

నగరంలోని మెట్రో రైళ్లకు అదనపు కోచ్‌లు, కొత్త రైళ్లను ఇప్పట్లో తీసుకొచ్చే అవకాశం లేదని తెలుస్తోంది. ఎల్‌అండ్‌టీ నుంచి నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం పూర్తిగా తీసుకుంటున్న తరుణంలో అదనపు కోచ్‌ల ఏర్పాటు మరికొన్ని రోజుల పాటు ఆలస్యమయ్యేట్లు కనిపిస్తోంది. ముందుగా బ్యాంకులకు చెల్లించాల్సిన ఎల్‌అండ్‌టీ అప్పులు రూ.13 వేల కోట్లు, వన్‌టైం సెటిల్‌మెంట్ కింద సంస్థకు ఇవ్వాల్సిన రూ.2వేల కోట్లను ఇచ్చేందుకు ముందుకు సాగుతోంది. తక్కువ వడ్డీతో రుణాలు ఇచ్చే బ్యాంకులను వెతుకుతూ సదరు మొత్తాన్ని చెల్లించేందుకు ప్రయత్నిస్తోంది.



## భారీగా పతనమైన బంగారం ధర

పసిడి ప్రియులకు గుడ్‌న్యూస్. రోజూ పెరుగుతూ సరికొత్త రికార్డులను నమోదు చేస్తున్న బంగారం బుధవారం భారీ తగ్గుదలను నమోదు చేసింది. హైదరాబాద్‌లో బులియన్ మార్కెట్‌లో 24 క్యారెటర్ల పది గ్రాముల బంగారం ధర బుధవారం ఉదయం పది గంటల సమయానికి 3, 380 రూపాయలు తగ్గి రూ.1,27,200కు చేరింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 3, 100 తగ్గి రూ. 1, 19, 690కి చేరింది. అంతర్జాతీయ మార్కెట్లో మంగళవారం ఔన్స్ (31.10 గ్రాములు) ధర తగ్గడం వల్లే బంగారం ధరల తగ్గుదలకు కారణంగా కనిపిస్తోంది. ఔన్స్ 24 క్యారెట్ల బంగారం ధరం ఏకంగా 245 డాలర్లు క్షీణించింది. 4097 డాలర్లకు దిగి వచ్చింది. మరోవైపు వెండి కూడా ఔన్స్ ధర 3.9 డాలర్లు తగ్గి 48.39 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో వెండి ధరలు కిలోకు దాదాపు రూ.2 వేలు తగ్గి రూ.1.80 లక్షలకు చేరుకున్నాయి. 2013 తర్వాత ఈ రెండు లోహాలు ఒక్క రోజులో ఇంత భారీగా పతనం కావడం ఇదే తొలిసారి. ఈ రెండు లోహాలు గరిష్టాలకు చేరువు కావడం, అంతర్జాతీయంగా డాలర్ తిరిగి బలోపేతం కావడం, పలు దేశాల మధ్య ఉద్రిక్తతలు చల్లబడడం అంతర్జాతీయ విపణిలో బంగారం ధర పతనానికి కారణాలుగా కనిపిస్తున్నాయి.

# సీఎం రేవంత్ రెడ్డి టార్గెట్‌గా? వెనక ఊగిస్తున్న కదలికలు ఎవరివి?



తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు పూర్తవుతున్న వేళ, పార్టీ అంతర్గత పరిస్థితులు తారుమారు అవుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మొదట్లో నేతలంతా ఐక్యంగా ఉన్నట్లు కనిపించినా, ఇప్పుడు మాత్రం వారు ఒక్కొరుగా విభిన్న ధోరణిలో వ్యవహరిస్తుండటం పార్టీకి పెద్ద సవాలుగా మారింది.ఇటీవల ప్రభుత్వం నుంచి ఏవిధమైన పదవులు వదులుకోకుండానే నలుగురు ప్రముఖ నేతలు — మంత్రి కొండా సురేఖ, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి — ప్రభుత్వాన్నే టార్గెట్ చేయడం హాట్ టాపిక్‌గా మారింది. వీరిపై హైకమాండ్ ఏ చర్యలు తీసుకోకపోవడం వల్ల ఈ విమర్శలు మరింత ఉధృతమవుతున్నాయి.మాజీ మంత్రి కొండా సురేఖ వ్యవహారం అయితే రాజకీయ సీరియల్‌లా మారిపోయింది. గత ఆరు నెలలుగా వివాదాల వరుస కొనసాగుతూనే ఉంది. అక్కినేని ఫ్యామిలీ విషయంపై చేసిన వ్యాఖ్యల నుంచి మొదలైన వివాదం, చివరికి ఆమె సొంత ఓఎస్డీని ప్రభుత్వం తొలగించడంతో గరిష్ట స్థాయికి చేరుకుంది. ఈ అంశంపై స్పందించిన ఆమె కూతురు కూడా రంగంలోకి దిగడంతో మరింత దుమారం రేగింది. ఈ వివాదం తాత్కాలికంగా సద్దుమణిగినా, పార్టీకి తీవ్రంగా నష్టం జరిగిందని ప్రచారం సాగుతోంది.కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి కూడా విభేదాలకు కారణమవుతున్నారు. తనకు మంత్రి పదవి రాకుండా సీఎం రేవంత్ రెడ్డే అడ్డుపడుతున్నారని ఆయన ఆరోపిస్తున్నారు. ఎక్సైజ్ టెండర్లపై ఆయన తీసుకున్న స్వతంత్ర నిర్ణయాలు అధికార బృందానికి చిక్కులు తెచ్చిపెట్టాయి. మునుగోడులో ప్రత్యేక నిబంధనలు అమలు చేస్తూ చేసిన ప్రకటనలు ప్రభుత్వం సరైన దిశలో పనిచేస్తుందా అన్న అనుమానాలు రేపాయి.మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కూడా పార్టీకి దూరంగా ఉన్న నేతల్లో ఒకరిగా నిలుస్తున్నారు. వలస వచ్చిన నేతలకు నామినేటెడ్ పదవులు ఇచ్చి, సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న కార్యకర్తలను పక్కన పెట్టడం సరికాదని ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను నిలదీసిన ఘటనతో ఈ విషయం మరింత హైలైట్ అయింది.జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అయితే స్పష్టమైన విమర్శలతో వార్తల్లో నిలుస్తున్నారు. హైడ్రా ప్రాజెక్ట్ పనితీరు, నిధుల పంపిణీపై అసంతృప్తిని వ్యక్తం చేసిన ఆయన, "ఇంకొన్ని సార్లు గెలిపిస్తే నేనూ సీఎం అభ్యర్థిగా వస్తా" అనే వ్యాఖ్యలు చేయడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీసింది.ఈ పరిణామాలపై గాంధీ భవన్ వర్గాలు తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మొదటినుంచి వీరిపై క్రమశిక్షణాత్మక చర్యలు తీసుకుని ఉంటే, పార్టీకి ఈ స్థాయిలో ఇబ్బందులు ఎదురయ్యేవి కావు అని పేర్కొంటున్నారు. పైగా హైకమాండ్ వీరిపై చర్యలకు వెనకడుగు వేయడం వల్లే పరిస్థితి ఈ వరకు వచ్చింది అనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఇంకా కొందరు కాంగ్రెస్ నేతల వెనుక బీఆర్‌ఎస్ నేతలు ఉన్నారనే ఆరోపణలు కూడా ఇప్పుడు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితిని నియంత్రించకపోతే, కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తులో తీవ్రంగా నష్టం జరగడం తథ్యమేనని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.




## 11 నెలల్లో రూ.918.59 కోట్లు

తిరుమల శ్రీవారి ట్రస్టులకు విరాళాలు భారీగా పెరిగాయి. గడిచిన 11 నెలల్లో వివిధ ట్రస్టులకు రూ.918.59 కోట్లు విరాళాలు అందాయి. టీటీడీలోని 11 ట్రస్టుల్లో అత్యధికంగా ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.338.80 కోట్లు రాగా, రెండవ స్థానంలో శ్రీవాణి ట్రస్టు నిలిచింది. ఈ ట్రస్టుకు రూ.252.83 కోట్లు అందాయి. ఇక, ఎస్వీ ఆరోగ్య వరప్రసాదిని స్కీంకు రూ.97.97 కోట్లు, ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు రూ.66.53 కోట్లు, ఎస్వీ గోసంరక్షణకు రూ.56.77 కోట్లు, విద్యాదానం ట్రస్టుకు రూ.33.47 కోట్ల విరాళాలు అందాయి. అలాగే బర్డ్ ట్రస్టుకు రూ.30.02 కోట్లు, సర్వశ్రేయాస్‌కు రూ.20.46 కోట్లు, వేదపరిరక్షణ ట్రస్టుకు రూ.13.87 కోట్లు, ఎస్వీబీసీ ట్రస్టుకు రూ.6.29 కోట్లు, స్విమ్స్‌కు రూ.1.52 కోట్ల చొప్పున విరాళాల రూపంలో అందాయి. ఈ 11 నెలల్లో ఆఫ్‌లైన్ ద్వారా రూ.339.20 కోట్లు విరాళాలుగా అందగా, ఆన్‌లైన్ ద్వారా 579.38 కోట్లు వచ్చాయి.

**రెండురోజుల్లో హుండీ ద్వారా రూ.8.83 కోట్లు**

తిరుమల శ్రీవారికి రెండురోజుల్లో హుండీ ద్వారా రూ.8.83 కోట్ల ఆదాయం లభించింది. శనివారం ఒక్కరోజే రూ.7.97 కోట్లు వచ్చింది. ఆదివారం రూ.3.86 కోట్లు ఆదాయం సమకూరింది. ఇక, ఆదివారం 84,017 మంది, సోమవారం 72,026 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, ఈ రెండురోజుల్లో 53,401 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

## కోరిక తీర్చాలని రౌడీ షీటర్ వేధింపులు.. టార్చర్ భరించలేక వివాహిత ఆత్మహత్య



ఖమ్మం జిల్లాలో రౌడీషీటర్ ఆగడాలకు ఓ మహిళ బలైంది. తన కోరిక తీర్చాలని కొంతకాలంగా వెంటపడటమే కాకుండా.. రెచ్చిపోయి బలవంతం చేయబోవడంతో మనస్తాపం చెందిన ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం వి. వెంకటాయపాలెం పంచాయతీ జగ్యాతండాకు చెందని బోడ సుశీల(28)పై ఆమె ఇంటి ఎదురుగా ఉండే రౌడీ షీటర్ ధరావత్ వినయ్ కొంతకాలంగా కన్నేశాడు. ఆమెను తరచూ వేధింపులకు గురిచేసేవాడు. ఈ క్రమంలో పత్తి తీసేందుకు సుశీల మరో మహిళతో కలిసి సోమవారం నాడు కొణిజర్ల మండలం అమ్మపాలెం వెళ్లింది. అక్కడ సుశీలను గమనించిన రౌడీషీటర్ ధరావత్ వినయ్ ఆమె దగ్గరకు వెళ్లాడు. తన కోరిక తీర్చాలని వేధింపులకు దిగాడు. సుశీల ప్రతిఘటించడంతో ఆమెపై దాడికి పాల్పడి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దీంతో మనస్తాపం చెందిన సుశీల ఇంటికి వచ్చిన తర్వాత ఉరేసుకుంది. వినయ్ వేధింపుల వల్లే తన భార్య ఆత్మహత్య చేసుకుందని సుశీల భర్త శివకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉంటే సుశీల మృతిపై ఆమె బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సుశీల ఒంటిపై గాయాలు ఉన్నాయని, శవపరీక్షలో వాటిని పరిగణనలోకి తీసుకోలేదని, ఉరేసుకుని మరణించిందని మాత్రమే వైద్యులు చెబుతున్నారని ఆరోపించారు. ఈ కేసును పక్కదారి పట్టిస్తున్నారని ఆందోళనకు దిగారు.

## మెరిసిన రకుల్ ప్రీత్ సింగ్



తెలుగు ప్రేక్షకులకు ఇష్టమైన హీరోయిన్ రకుల్. తక్కువ సమయంలోనే తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ అందాల భామ. తెలుగు, తమిళం, హిందీ భాషలలో అనేక హిట్ చిత్రాల్లో నటించి మెప్పించింది. ఇప్పుడు మాత్రం సినిమాలకు దూరంగా ఉంటుంది. హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్. పాన్ ఇండియా సినీప్రియులకు ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేని పేరు. ఈ వయ్యారి భామ తన అందంతో, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. తక్కువ సమయంలోనే ఈ బ్యూటీ విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ సొంతం చేసుకుంది. రకుల్ ఇప్పుడు ఎక్కువగా హిందీలో నటిస్తుంది. ఇటీవలే ఆమె దే దే ప్యార్ దే 2 చిత్రంలో నటించింది. ఆయేషా ఖురానా పాత్రలో కనిపించనుంది. ఇందులో అజయ్ దేవగన్, ఆర్. మాధవన్, టబు కీలకపాత్రలు పోషించగా.. నవంబర్ 14న రిలీజ్ కానుంది.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

RT76పై హీరోయిన్

# సాలిడ్ అప్డేట్

మాస్ రాజా రవితేజ నటిస్తున్న 'మాస్ జాతర' అక్టోబర్ 31న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అయింది. ఈ సినిమాను భాను బోగవరపు డైరెక్ట్ చేస్తుండటంతో ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి విజయాన్ని అందుకుంటుందా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఇక ఈ క్రమంలో రవితేజ నెక్స్ట్ చిత్రం RT76పై హీరోయిన్ ఆషికా రంగనాథ్ ఓ సాలిడ్ అప్డేట్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ స్పెయిన్‌లో జరుగుతుందని.. అక్కడ ఓ సాంగ్ షూటింగ్ చేస్తున్నట్లు ఆమె కొన్ని ఫోటోలు సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఇక ఈ పాట షూటింగ్‌తో స్పెయిన్ షెడ్యూల్ పూర్తవుతున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది. కాగా, ఈ RT76 చిత్రాన్ని దర్శకుడు కిషోర్ తిరుమల డైరెక్ట్ చేస్తుండగా 2026 సంక్రాంతి కానుకగా ఈ చిత్రాన్ని రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు.



## తన కలల ప్రాజెక్టు అని ట్రూత్ సోషల్‌లో ప్రకటించిన ట్రంప్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన చిరకాల స్వప్నంగా భావిస్తున్న ప్రాజెక్టును పట్టాలెక్కించారు. శ్వేతసౌధం ప్రాంగణంలో అత్యంత సువిశాలమైన, ఆధునికమైన బాల్‌రూమ్ నిర్మాణ పనులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని ట్రంప్ స్వయంగా తన ట్రూత్ సోషల్ ఖాతా ద్వారా వెల్లడించారు. వైట్‌హౌస్ తూర్పు విభాగంలో ఈ నిర్మాణం కోసం సోమవారం కూల్చివేతలు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. "వైట్‌హౌస్ మైదానంలోని తూర్పు విభాగంలో అతిపెద్ద, అందమైన బాల్‌రూమ్ నిర్మాణ పనులు మొదలయ్యాయని చెప్పడానికి ఎంతో సంతోషిస్తున్నాను" అని ట్రంప్ తన పోస్టులో పేర్కొన్నారు. గత 150 ఏళ్లుగా ప్రతి అమెరికా అధ్యక్షుడు వైట్‌హౌస్‌లో గ్రాండ్ పార్టీలు, ప్రత్యేక కార్యక్రమాల కోసం ఒక పెద్ద బాల్‌రూమ్ ఉండాలని కలలు కన్నారని, ఎట్టకేలకు ఆ ప్రాజెక్టు ఇప్పుడు ప్రారంభమైందని ఆయన వివరించారు. ఈ ఏడాది జూలైలో ఈ ప్రాజెక్టు గురించి ట్రంప్ మొదటిసారి ప్రకటించిన విషయం తెలిసిందే.ఈ భారీ నిర్మాణానికి సంబంధించిన ఓ ముఖ్యమైన విషయాన్ని కూడా ట్రంప్ స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుకు అయ్యే ఖర్చును ప్రభుత్వ నిధుల నుంచి కాకుండా పూర్తిగా దాతలు అందించే విరాళాలతో భరిస్తున్నట్లు ఆయన తెలిపారు. దీనివల్ల అమెరికా ప్రజలపై ఎలాంటి ఆర్థిక భారం పడదని ఆయన పేర్కొన్నారు.ఇక, ఈ బాల్‌రూమ్‌ను 250 మిలియన్ డాలర్ల వ్యయంతో నిర్మించనున్నారు. ౯౦ వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఒకేసారి ౯౯౯ మంది కూర్చునే సామర్థ్యంతో దీనిని నిర్మించబోతున్నారు. ఈ ప్రాజెక్టుతో వైట్‌హౌస్ రూపురేఖల్లో కీలక మార్పు రానుందని విశ్లేషకులు భావిస్తున్నారు.



# పంత్ రీఎంట్రీ

ఈ ఏడాది జులైలో ముగిసిన ఇంగ్లండ్ పర్యటనలో భాగంగా మాంచెస్టర్ టెస్టులో గాయపడి అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమైన భారత జట్టు వికెట్ కీపర్ రిషభ్ పంత్ తిరిగి జట్టులోకి వచ్చేందుకు సిద్ధమయ్యాడు. కాలి గాయానికి శస్త్రచికిత్స అనంతరం కొద్దిరోజులు విరామం తీసుకున్న అతడు పూర్తి ఫిట్‌నెస్ సాధించడంతో సెలక్టర్లు పంత్‌నుఉ త్వరలో దక్షిణాఫ్రికా 'ఏ'తో జరుగబోయే రెండు టెస్టులకు భారత 'ఏ' జట్టుకు సారథిగా నియమించారు. అక్టోబర్ 30 నుంచి బెంగళూరులోని సీవోఈ వేదికగా ఈ మ్యాచ్‌లు జరుగుతాయి. దక్షిణాఫ్రికాతో వచ్చేనెల 14 నుంచి మొదలుకాబోయే రెండు టెస్టుల సిరీస్‌కు సన్నాహకంగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లలో పంత్‌కు డిప్యూటీగా సాయి సుదర్శన్ వ్యవహరించనున్నాడు. రెండో మ్యాచ్‌కు భారత జట్టు రెగ్యులర్ ఆటగాళ్లైన కేఎల్ రాహుల్, మహ్మద్ సిరాజ్, ధ్రువ్ జురెల్ సైతం అందుబాటులో ఉండనున్నారు.

ప్రాణం తీసిన పండుగ పయనం..

## రైలు కింద పడి యువకుడి మృతి

తెలంగాణ రాష్ట్రంలోని వికారాబాదు జిల్లాకు చెందిన మర్పల్లి మండల కేంద్రంలో బుధవారం ఉదయం జరిగిన విషాద ఘటనలో రైలు కింద పడి శ్రీకాంత్ (28) అనే యువకుడు మృతి చెందాడు. పండుగ సందర్భంగా స్వగ్రామానికి వచ్చిన యువకుడు రైల్వే గేటు సమీపంలో ప్రమాదవశాత్తు రైలుకు బలయ్యాడు. ఈ సంఘటన స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. మర్పల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్, పట్టణంలో ఒక దుకాణంలో పనిచేస్తూ గత సంవత్సరం నుండి అక్కడే జీవనం సాగిస్తున్నాడు. పండుగను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి జరుపుకునేందుకు కేవలం రెండు రోజుల క్రితమే తన స్వగ్రామానికి చేరుకున్నాడు. ఈ పండుగ వేళ రైలు పట్టాల పక్కన శ్రీకాంత్ విగతదేహం కనిపించడం స్థానికులను కలచివేసింది. ఉదయం రైల్వే గేటుకు సమీపంలో శ్రీకాంత్ రైలుకు బలైనట్లు గుర్తించిన గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు పట్టణంలో పనిచేసే క్రమంలోనే రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడా లేక ప్రమాదవశాత్తు ఈ దుర్ఘటన జరిగిందా అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పండుగ వేళ ఇలాంటి విషాదం చోటు చేసుకోవడంతో మర్పల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటగా, యువకుడి అకాల మరణంపై గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు. గత ఏడాదిగా పట్టణంలో ఉన్న యువకుడు పండుగ కోసం వచ్చి ఇలా మృతి చెందడంపై గ్రామమంతా శోకసంద్రంలో మునిగింది.

## ఓపెన్‌ఏఐ సంచలనం.. 'అట్లాస్' బ్రౌజర్‌తో గూగుల్‌కు గట్టి పోటీ



సంచలన లాంచ్, డిజిటల్ మార్కెట్‌లో కొత్త పోరు ChatGPT ద్వారా ప్రపంచంలోనే అత్యంత విలువైన స్టార్టప్‌గా ఎదిగిన ఓపెన్‌ఏఐ (OpenAI), ఇప్పుడు నేరుగా గూగుల్ (Google) అడ్డాపైకి అడుగుపెట్టింది. సాంప్రదాయ వెబ్ బ్రౌజర్లకు గట్టి పోటీనిచ్చేందుకు, సంస్థ తమ సొంత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) ఆధారిత బ్రౌజర్ 'అట్లాస్' (Atlas) ను తాజాగా విడుదల చేసింది. ఈ కొత్త ఉత్పత్తి, చాట్‌బాట్ టెక్నాలజీని వెబ్ బ్రౌజింగ్‌తో పూర్తిగా అనుసంధానం చేయనుంది. తద్వారా, యూజర్లు ఇంటర్నెట్‌తో మరింత ఇంటరాక్టివ్‌గా, సమర్థవంతంగా వ్యవహరించేందుకు అవకాశం కలుగుతుంది. ఇంటర్నెట్ వినియోగంలో ఒక దశాబ్దానికి ఒకసారి వచ్చే పునరాలోచన ఇది అని ఓపెన్‌ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మన్ అభివర్ణించారు. రెవెన్యూ వ్యూహం, విస్తరణ ప్రణాళికలు 'అట్లాస్' బ్రౌజర్ లాంచ్‌తో, ఓపెన్‌ఏఐ తన విస్తృత యూజర్ బేస్ను (800 మిలియన్లకు పైగా ఉన్న ChatGPT యూజర్లు) డిజిటల్ అడ్వర్టైజింగ్ (డిజిటల్ ప్రకటనలు) రెవెన్యూగా మార్చుకునేందుకు సన్నద్ధమవుతోంది. క్రోమ్ వంటి అగ్రశ్రేణి బ్రౌజర్ల మాదిరిగానే, 'అట్లాస్' కూడా ఇంటర్నెట్ ట్రాఫిక్‌ను పెంచుకుని, ఆ ద్వారా వచ్చే ఆదాయ మార్గాలపై దృష్టి సారించింది. ఈ బ్రౌజర్‌లో చాట్‌జీపీటీని ప్రధాన కేంద్రంగా ఉంచడం వల్ల, యూజర్ల ఆన్‌లైన్ కార్యకలాపాలను మరింత లోతుగా అర్థం చేసుకోవడానికి, వ్యక్తిగతీకరించిన సేవలను అందించడానికి ఓపెన్‌ఏఐకి వీలవుతుంది. ఈ వ్యూహం గూగుల్ సెర్చ్ మరియు క్రోమ్‌లకు పెద్ద సవాలుగా పరిణమించనుంది.
బ్రౌజర్ ప్రత్యేకతలు మరియు ఏఐ సామర్థ్యాలు ప్రస్తుతం యాపిల్ మ్యాక్ఓఎస్ (macOS) ల్యాప్‌టాప్‌లలో అందుబాటులోకి వచ్చిన 'అట్లాస్', త్వరలోనే మైక్రోసాఫ్ట్ విండోస్ (Windows), యాపిల్ ఐఓఎస్ (iOS), మరియు ఆండ్రాయిడ్ (Android) ప్లాట్‌ఫామ్‌లలోకి విస్తరించనుంది. ఈ బ్రౌజర్ యొక్క ముఖ్య లక్షణం, ఏఐతో కూడిన 'ఏజెంట్ మోడ్' (Agent Mode). ఈ ఫీచర్ ద్వారా, యూజర్లు ఆన్‌లైన్ టాస్క్‌లను ఏఐకే అప్పగించవచ్చు. ఉదాహరణకు, ఫ్లైట్ రిజర్వేషన్లు బుక్ చేయడం లేదా డాక్యుమెంట్‌లను ఎడిట్ చేయడం వంటి పనులను ఈ ఏఐ ఏజెంట్ యూజర్ తరపున పూర్తి చేయగలుగుతుంది. చాట్‌జీపీటీ సైడ్‌బార్ ద్వారా వెబ్‌పేజీలను సమగ్రంగా సారాంశం చేయవచ్చు (summarize), ప్రశ్నలకు సమాధానాలు పొందవచ్చు మరియు టెక్స్ట్‌ను మెరుగుపరచవచ్చు.
పెరుగుతున్న ఏఐ పోటీ, మార్కెట్ ప్రభావం ఓపెన్‌ఏఐ యొక్క 'అట్లాస్' రాకతో, టెక్ మార్కెట్‌లో 'ఏఐ బ్రౌజర్'ల పోటీ మరింత తీవ్రమైంది. బ్రౌజర్ మార్కెట్‌లో గూగుల్ క్రోమ్‌కు ఉన్న అపారమైన ఆధిపత్యాన్ని సవాలు చేయడానికి ఈ కొత్త ప్రయత్నం దోహదపడుతుంది. క్రోమ్ కూడా తమ జెమినీ (Gemini) ఏఐ టెక్నాలజీని ఇప్పటికే అనుసంధానించిన నేపథ్యంలో, ఇంటర్నెట్ బ్రౌజింగ్‌లో సాంప్రదాయ పద్ధతుల స్థానంలో 'సంభాషణ-ఆధారిత' (Conversational AI) ఇంటర్‌ఫేస్‌లు ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. ఈ పరిణామం డిజిటల్ ప్రకటనలు, డేటా నియంత్రణ మరియు వినియోగదారు అనుభవంపై భారీ ప్రభావం చూపనుంది.

తెలంగాణ రాష్ట్రంలో అక్టోబర్ 26 వరకు వర్షాలు, 20 జిల్లాలకు

# ఎల్లో అలర్ట్.. ఐఎండీ హెచ్చరిక!

తెలంగాణ రాష్ట్రంలో మరో ఐదు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (IMD) వెల్లడించింది. ఈ నెల అక్టోబర్ 26వ తేదీ వరకు రాష్ట్రంలో అక్కడక్కడ వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ అంచనా వేసింది. ముఖ్యంగా ఈ రోజు (తేదీ) రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు కురుస్తాయని తెలిపింది. రాష్ట్రంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులు రైతులకు, ప్రజలకు ముఖ్యమైన హెచ్చరికగా నిలిచాయి. వర్షాల నేపథ్యంలో, భారత వాతావరణ శాఖ తెలంగాణలోని దాదాపు 20 జిల్లాలకు 'ఎల్లో అలర్ట్' జారీ చేసింది. ఈ హెచ్చరిక జారీ చేసిన జిల్లాల జాబితాలో ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలతో పాటు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలు ఉన్నాయి. ఈ జిల్లాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షాల సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడే



అవకాశం ఉన్నందున, రైతులు తమ పంటలకు నష్టం జరగకుండా తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని వాతావరణ శాఖ సలహా ఇస్తోంది. అలాగే, వర్షం పడుతున్న సమయంలో ప్రజలు ముఖ్యంగా బహిరంగ ప్రదేశాలలో, చెట్ల కింద ఉండకుండా సురక్షిత ప్రాంతాలకు వెళ్లడం మంచిది. ఈదురు గాలులు వీచే అవకాశం కూడా ఉందని హెచ్చరికల్లో పేర్కొనబడింది. వాతావరణ మార్పుల దృష్ట్యా, రాష్ట్ర విపత్తుల నిర్వహణ బృందాలు, సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సహాయం అందించడానికి సిద్ధంగా ఉండాలని సూచించింది. రాబోయే కొద్ది రోజుల్లో వర్షాల తీవ్రత, విస్తరణను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు అధికారిక వాతావరణ అంచనాలను అనుసరించడం చాలా ముఖ్యం.

## భర్తపై మరిగే నీళ్లు, యాసిడ్ పోసిన భార్య

అహ్మదాబాద్‌లో దారుణం చోటుచేసుకుంది. భర్తపై భార్య మరిగే నీళ్లు పోసింది. అంతటితో ఆమె ఆగలేదు. మళ్లీ, యాసిడ్ పోసేసింది. భర్త తీవ్రంగా గాయపడటంతో వెంటనే స్థానికులు అతడిని ఆసుపత్రికి తరలించారు. భర్త ఫిర్యాదు ఆధారంగా భార్యను అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. 33 ఏళ్ల రోనక్ అనే వ్యక్తి వివాహం చేసుకుని రెండేళ్లు అయింది. అయితే, ఆమె భర్తకు వేరే మహిళతో సంబంధం ఉందని భార్య అనుమానిస్తూ ఉండేది. చిన్న చిన్న విషయాలకే ఎప్పుడూ గొడవలు పడుతుండేవారని స్థానికులు తెలిపారు. ఈ జంట గతంలో వేజల్‌పూర్‌లో నివసించారు. అయితే, అక్కడ కూడా గొడవలు పడుతుండటంతో పోలీసులు రాజీ కుదిరించడానికి ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. దీపావళి రోజున ఉదయం మళ్ళీ వారిద్దరి మధ్య గొడవ జరిగింది. తర్వాత భార్యపై అసహనంతో భర్త బెడ్ రూమ్‌కు వెళ్లి నిద్రపోయాడు. అయితే, భార్య మాత్రం తన కోపాన్ని కంట్రోల్ చేసుకులేకపోయింది. ఇక



ఆవేశంలో నిద్రపోతున్న భర్తపై మరిగే నీళ్లు పోసింది. నిద్రలో ఉలిక్కిపడ్డ భర్త వెంటనే గట్టిగా కేకలు వేసి భార్య నుంచి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. వేడి నీళ్లు పడిన బట్టలను తీసేయడానికి ప్రయత్నించాడు. కానీ, భార్య అతనిపై యాసిడ్ దాడి చేసింది. దీంతో అతడికి తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే అప్రమత్తమైన స్థానికులు అతడి చావు కేకలకు అప్రమత్తమై హుటాహుటినా రోనక్‌ను ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉంది. తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో అల్లడుతున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు భార్యను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.